# మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

**కలెక్టర్ పమేలా సత్పతి**




కరీంనగర్, జనతా న్యూస్ : మహిళలు తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటూ అన్ని రంగాల్లో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బుధవారం కరీంనగర్ కళాభారతి భవనంలో డెమోక్రటిక్ సంఘ ఆధ్వర్యంలో జిల్లాలోని పలువురు మహిళా వార్డు సభ్యులకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి డెమోక్రటిక్ సంఘ సహ వ్యవస్థాపకురాలు, సినీనటి రెజీనా కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తాను సుమారు పది సంవత్సరాలుగా రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్నానని తెలిపారు. మహిళా ప్రజాప్రతినిధులు ఉన్న చోట ప్రజా సమస్యలు గణనీయంగా తగ్గుముఖం పడుతున్నాయని పేర్కొన్నారు. డెమోక్రటిక్ సంఘ సహకారంతో మహిళలు ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించడం అభినందనీయమని, భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. అందరితో గౌరవంగా మెలుగుతూ ప్రజల కోసం నిబద్ధతతో పనిచేస్తే మంచి పేరు దానంతట అదే వస్తుందని తెలిపారు. తమ్ముడు, భర్త, తండ్రి లేదా కుమారుడు చెప్పిన మేరకే పరిమితమవకుండా ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని మహిళా వార్డు సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సినీనటి, డెమోక్రటిక్ సంఘ సహ వ్యవస్థాపకురాలు రెజీనా మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత మహిళల్లో అసాధారణ శక్తి ఉందని, దానిని సద్వినియోగం చేసుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించి మహిళల ఆలోచనలు విన్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత మహిళల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే డెమోక్రటిక్ సంఘ ముఖ్య ఉద్దేశమని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఇరవై ఐదు మంది మహిళలకు ప్రోత్సాహం అందించగా, పద్దెనిమిది మంది నామినేషన్లు దాఖలు చేశారని వివరించారు. వీరిలో పదకొండు మంది మహిళలు వార్డు సభ్యులుగా ఎన్నికైనట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డెమోక్రటిక్ సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక క్వారీని పరిశీలించిన కలెక్టర్, సీపీ

**వివరాలు తెల్సుకున్న అధికారులు**



తిమ్మాపూర్, జనతా న్యూస్ : తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి వద్ద ఇరిగేషన్, టీఎస్ఎండీసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఇసుక క్వారీని బుధవారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమీషనర్ గౌస్ అలాం పరిశీలించారు. లోయర్ మానేరు డ్యాంలోని మోయత-ుమ్మెద వాగులో నీటి నుండి ఇసుకను తీసే విధానాన్ని వారు స్వయంగా చూశారు. పూడికతీతలో భాగంగా ఇసుకను, మట్టిని వేరు చేసే విధానం ఎలా చేస్తారనేది అధికారులను, కాంట్రాక్టర్లను అడిగి తెల్సుకున్నారు. రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా కొత్తపల్లిలో నీటిలో పూడికతీతను ప్రారంభించినట్లు కాంట్రాక్టర్లు తెలిపారు. టెండర్ ప్రక్రియ విధానం, అగ్రిమెంట్, ప్రభుత్వానికి వచ్చే ఆదాయం, ఇసుక విక్రయం, మార్కెటింగ్ కి సంబంధించిన వివరాలను అధికారులు వివరించారు. పూడిక తీతలో భాగంగా తీసిన ఇసుక నిల్వలను పరిశీలించి, ప్రతీ రోజు విక్రయిస్తున్న ఇసుక వివరాలను తెల్సుకున్నారు. అక్కడున్న సీసీ కెమెరాలు, లారీల్లో లోడింగ్ వివధానం, వే బిల్లులు, కంప్యూటర్ లో నమోదు వివరాలను కలెక్టర్, సీపీ స్వయంగా పరిశించారు. వీటికి సంబంధించిన వివరాలను తమకు అందించాలని టీఎస్ఎండీసీ పీవోను ఆదేశించారు. లారీల్లో లోడింగ్ విధానం, లోడింగ్ సమయం తదితర విషయాలను వారు ఆరా తీశారు. ఇప్పటి వరకు ఎంత ఇసుకను విక్రయించారు, ప్రభుత్వానికి ఎంత ఆదాయం వచ్చిందనే వివరాలను తెల్సుకున్నారు. కలెక్టర్, సీపీ వెంట ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్, ఏఈ వంశీ, టీఎస్ఎండీసీ పీవో వినయ్, కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ కుమార్, తిమ్మాపూర్ సీఐ సదన్ కుమార్, తహశీల్దార్ శ్రీనివాస రెడ్డి, ఎంపీడీవో రాజీవ్ మల్హోత్రా, కాంట్రాక్టర్లు ఉన్నారు.

## చిగురుమామిడి జూనియర్ కళాశాలలో 122 దేశాల నాణేల ప్రదర్శన



చిగురుమామిడి,జనత న్యూస్: ప్రభుత్వ జూనియర్ కళాశాల, చిగురుమామిడిలో 122 దేశాలకు చెందిన కరెన్సీ నాణేలు, 100 దేశాల తపాలా స్టాంపులు, అరుదైన పుస్తకాలతో ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను రిటైర్డ్ లైబ్రేరియన్ మనోహర్ రావు సేకరణలతో కళాశాల ప్రిన్సిపల్ శశిధర్ శర్మ, అధ్యాపకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ప్రదర్శనను చిగురుమామిడి జూనియర్ కళాశాల విద్యార్థులతో పాటు చిగురుమామిడి, గన్నేరువరం, తిమ్మాపూర్ ప్రాంతాలకు చెందిన 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు తిలకించారు. ఇంత విస్తృతమైన దేశాల నాణేలు, స్టాంపులు ఎప్పుడూ చూడలేదని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 9వ, 10వ తరగతి విద్యార్థులకు ప్రేరణాత్మక కార్యక్రమం నిర్వహించి, కళాశాల ప్రత్యేకతలు, విద్యావకాశాలపై అవగాహన కల్పించారు. అనంతరం కళాశాలలోని ప్రయోగశాలలు, క్రీడా గది, థియేటర్ రూమ్‌ను విద్యార్థులు వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పావని, చిగురుమామిడి పాఠశాల హెచ్ఎం హర్షద్ మహమ్మద్, ఇందుర్తి పాఠశాల హెచ్ఎం జయప్రదతో పాటు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## వైన్ షాపుల తరలింపు.. బెల్ట్ షాపుల రద్దు

**చిగురుమామిడి పంచాయతీ పాలకవర్గం కీలక తీర్మానం**



చిగురుమామిడి, జనత న్యూస్: గ్రామ అభివృద్ధి, ప్రజల సౌకర్యార్థం చిగురుమామిడి గ్రామ పంచాయతీ పాలకవర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఆకవరం భవాని శివప్రసాద్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న పలు సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి ఏకగ్రీవంగా తీర్మానాలు చేశారు. గ్రామం నడిబొడ్డున ఉన్న మద్యం దుకాణాల వల్ల ప్రజలకు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్న దృష్ట్యా, వాటిని తక్షణమే ఊరి చివరకు తరలించాలని పాలకవర్గం నిర్ణయించింది. అలాగే గ్రామంలో అక్రమంగా కొనసాగుతున్న బెల్ట్ షాపులను పూర్తిగా మూసివేయాలని తీర్మానించారు. గ్రామ మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా పాడైపోయిన చేతి పంపులకు (బోరింగ్‌లు) వెంటనే మరమ్మతులు చేపట్టాలని, ప్రమాదకరంగా ఉన్న ఇనుప విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో సిమెంట్ పోల్స్ వేయాలని సంబంధిత శాఖ అధికారులకు విన్నవించనున్నారు. ప్రజా సంక్షమమే ధ్యేయంగా దాతల సహకారంతో వైకుంఠ రథం, ఫ్రీజర్‌ను కొనుగోలు చేయాలని నిశ్చయించారు. గ్రామంలో ఎవరైనా మరణించిన పక్షంలో, ఆ కుటుంబం వారు కేవలం రూ. 516 చెల్లిస్తే అంత్యక్రియల రోజున ఉచితంగా వాటర్ ట్యాంకర్ సౌకర్యం కల్పించాలని నిర్ణయం తీసుకున్నారు. పారిశుధ్య కార్మికుల సంక్షమం దృష్ట్యా వారికి రెండు జతల నూతన దుస్తులతో పాటు అవసరమైన శానిటేషన్ మెటీరియల్‌ను అందించనున్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా గ్రామంలో నూతనంగా నాలుగు వి.ఓ భవనాల నిర్మాణం, ప్రభుత్వ పాఠశాల ప్రహరీ వద్ద షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఆమోదం తెలిపారు. ఊర చెరువు వద్ద మెట్ల నిర్మాణంతో పాటు, ప్రజల వ్యాయామం కోసం ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయనున్నట్లు సర్పంచ్ వెల్లడించారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి రమేష్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతో పాటు, ప్రాథమిక విద్య లక్ష్యంగా అంగన్వాడి సెంటర్

**గూడెం సర్పంచ్ గూడెల్లి శ్రీకాంత్.**



జనత న్యూస్ బెజ్జంకి: మండలంలోని గూడెం గ్రామంలో బుధవారం అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన అన్న ప్రాసన, అక్షరబ్యాసం ,గర్భిణీ లు,బాలింతలకు గుడ్లు,బాలామృతం పంపిణీ కార్యక్రమంలో సర్పంచ్ గూడెల్లి శ్రీకాంత్ ఉపసర్పంచ్ యాలాల పర్శరాములు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గూడెల్లి శ్రీకాంత్ మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం ప్రాథమిక విద్య అందించడంతో పాటు పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నాయి అని,గర్భిణీలు, బాలింతల్లో పోషణ స్థాయిని మెరుగు పరచటమే కాకుండా తల్లితో పాటు బిడ్డకు పోషకాలు అందించటమే లక్ష్యంగా పని చేస్తున్నాయని, అంగన్వాడీ లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మాంకాళ సుగుణ , కార్యదర్శి మెరుగు యాదగిరి అంగన్వాడీ టీచర్ మాంకాళ సరోజన,గర్భిణి స్రీలు మరియు స్కూల్ టీచర్స్ పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు టీ షర్టు పంపిణీ




జనత న్యూస్ బెజ్జంకి: మండలంలోని లక్ష్మపూర్ గ్రామంలో బుధవారం గ్రామ సర్పంచ్ ముక్కిస కవిత గ్రామంలోని యువ క్రీడాకారులకు ఏకరూప క్రీడ టీ షర్టు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ జెర్సీలను పంపిణీ చేసినట్లు తెలిపారు. క్రీడల్లో రాణించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ గంగాధర హరీష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముక్కిస రత్నాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సమస్యల పరిష్కారం కోసం గ్రామ పాలకవర్గం సమావేశం



జనత న్యూస్ బెజ్జంకి : మండలంలోని లక్ష్మపూర్ గ్రామంలో బుధవారం నూతన పాలకవర్గం గ్రామ సర్పంచ్ ముక్కిస కవిత ఆధ్వర్యంలో గ్రామ కార్యదర్శి అనూష గ్రామ-సభ నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ గంగాధర హరీష్ , వార్డు సభ్యులు గ్రామంలో నెలకొన్న నీటి సమస్య, వీధి దీపాలు, సీసీ రోడ్లపై మట్టి కుప్పలు, మురికి కాలువలు పలు అంశాల పైన చర్చించి, సమస్యల పరిష్కారానికి నిర్ణయాలు తీసుకున్నట్లు పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ అంగన్వాడీ కార్యకర్తలు, ఐపి వివో ఏలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



జనత న్యూస్ బెజ్జంకి : మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ లకు, రాష్ట్ర కాంగ్రెస్ ప్రదేశ్ కమిటీలో రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్ష పదవి కేటాయించడంతో బుధవారం మండల కేంద్రంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్ మరియు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముక్కిస రత్నాకర్ ల ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ శ్రేణులు బాణసంచా కాల్చి , స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల విద్యార్థులకు అవగాహన




జనత న్యూస్ బెజ్జంకి: మండలంలోని దాచారం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బుధవారం బెజ్జంకి ఎస్సై సౌజన్య సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆన్లైన్ మోసాలు, నకిలీ లింకులు, ఫేక్ కాల్స్, ఓటిపి ల పట్ల జాగ్రత్తలు తెలిపారు. చట్టపరమైన సమస్యలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు అడిగిన సందేహాలకు సమాధానాలు ఇచ్చి, సురక్షత డిజిటల్ జీవనశైలిని పాటించాలని సూచించినట్లు పేర్కొన్నారు.

## ఇరువురు మంత్రులను కలిసిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వడి కృష్ణారావు



కోరుట్ల, జనతా న్యూస్: తెలంగాణ రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు, రాష్ట్ర రవాణా బీసీ సంక్షమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,లను ఈరోజు హైదరాబాద్ లో ని మంత్రుల నివాస భవనాల సముదాయంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వడి కృష్ణారావు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే కోరుట్ల నియోజకవర్గంలోని పలు సమస్యల గురించి మంత్రుల వద్ద ప్రస్తావించారు సమస్యల పరిష్కారానికి ఇరువురు మంత్రులు సానుకూలంగా స్పందించినట్లు జువ్వాడి కృష్ణారావు తెలిపారు.

## సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



కరీంనగర్, జనతా న్యూస్: సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఆరు వారాల ప్రత్యేక రాష్ట్రవ్యాప్త ప్రచార కార్యక్రమంలో భాగంగా, సైబర్ జాగ్రూకత దినోత్సవం సందర్భంగా కరీంనగర్ సైబర్ క్రైం పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ పట్టణంలోని మహిళల డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆరవ వారపు అంశమైన మహిళల రక్షణ ఉ పిల్లల సంరక్షణపై దృష్టి సారించి జరిగింది. ఈ సందర్భంగా డేటింగ్ మోసాలు, ఆన్‌లైన్ వేధింపులు, ఆన్‌లైన్ వెంబడింపు, వివాహ మోసాలు, బాలలపై ఆన్‌లైన్ నేరాలకు సంబంధించిన అంశాలపై విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా వివరించారు. విద్యార్థులకు మరింత స్పష్టత కలిగించేలా ప్రదర్శన తెర ద్వారా సైబర్ నేరాలకు సంబంధించిన అవగాహన చిత్రాలను ప్రదర్శించారు. వీటి ద్వారా మోసగాళ్లు అనుసరించే పద్ధతులు, మోసాలు ఎలా జరుగుతాయో, వాటి నుంచి ఎలా జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ సైబర్ క్రైం ఉప పోలీసు అధికారి కోత్వాల్ రమేష్, ఉప నిరీక్షకులు అనిల్, జ్యోష్ణ, మహిళల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వరలక్ష్మ, జాతీయ కేడెట్ దళం ఇన్‌చార్జ్ శ్రావణి, సైబర్ క్రైం పోలీస్ స్టేషన్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సైబర్ క్రైం సిబ్బంది మాట్లాడుతూ, సైబర్ నేరాల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద లింకులు, కాల్స్, సందేశాలకు స్పందించకూడదని సూచించారు. ఏవైనా సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 సహాయ నంబర్‌కు ఫోన్ చేయాలని, లేదా జాతీయ సైబర్ నేరాల ఫిర్యాదు పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమంలో 200కు పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, సైబర్ నేరాల నుంచి తమను తాము ఎలా రక్షించుకోవాలో విలువైన సమాచారం పొందారు. విద్యార్థుల్లో సైబర్ భద్రతపై చైతన్యం పెంపొందించడంలో ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు.

## విద్యార్థులతో గ్రామ సభ ప్రజాస్వామ్యంపై అవగాహన



గంగాధర, జనతా న్యూస్: గంగాధర మండలంలోని ఓడియారం జెడ్పీ హైస్కూల్‌లో గ్రామ సభ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ పంచాయతీ సర్పంచ్ శ్రీమతి చి. ఉమా, ఉపసర్పంచ్ గగన్, వార్డు సభ్యులు హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. సామాజిక శాస్త్ర పాఠ్యాంశంలో భాగంగా ప్రతి వార్డు నుంచి ఒక విద్యార్థిని ఎంపిక చేసి, తమ తమ వార్డుల్లో ఉన్న సమస్యలను గుర్తించి గ్రామ సభలో వివరించారు. విద్యార్థులు సమస్యలను ధైర్యంగా, స్పష్టంగా వివరించడం సభకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వారి ప్రదర్శనకు గ్రామ పాలక వర్గం, ఉపాధ్యాయులు ప్రశంసలు కురిపించారు. ఈ గ్రామ సభ ద్వారా విద్యార్థులకు గ్రామ పంచాయతీ విధులు, బాధ్యతలు, సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యుల పాత్రలపై ప్రాయోగిక అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధుల బాధ్యతలు ఏమిటన్న విషయాన్ని విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల నమోదు పెంపుపై చర్చించగా, ఏప్రిల్ నెలలో విద్యా వాహిని ఉ బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. అలాగే ప్రతిరోజూ పాఠశాల అసెంబ్లీకి గ్రామ పాలక వర్గం నుంచి ఒకరు హాజరుకావాలని కోరారు. కార్యక్రమం ముగింపులో గ్రామ పాలక వర్గానికి పాఠశాల ఆధ్వర్యంలో సన్మానం నిర్వహించారు. తమ వార్డుల సమస్యలను చక్కగా వివరించిన విద్యార్థులను గ్రామ పాలకులు అభినందించారు. నేటి విద్యార్థులే రేపటి బాధ్యతాయుత పౌరులు అన్న సందేశంతో ఈ గ్రామ సభ కార్యక్రమం స్ఫూర్తిదాయకంగా ముగిసింది.

# మున్సిపాలిటీలను బీజేపీకి అప్పగిస్తే అభివృద్ధి చేసి చూపిస్తాం

## కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



హుజూరాబాద్ / జమ్మికుంట , జనతా న్యూస్

హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీలను బీజేపీకి అప్పగిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలో లేకపోయినా, కేంద్రం నుంచి ప్రత్యేకంగా నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 6.5 కోట్ల నిధులతో జమ్మికుంట డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రాంగణంలో సింథటిక్ స్టేడియం నిర్మాణానికి సంబంధించి, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ స్థానిక ఆర్డీవో, తహసీల్దార్‌తో కలిసి నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్, సిబ్బందితో సమావేశమై, చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, జమ్మికుంటలో స్టేడియం నిర్మాణానికి గతంలో వచ్చిన ప్రతిపాదనలను కేంద్ర మంత్రిని కలిసి సమర్పించగా, మోదీ ప్రభుత్వం రూ. 6.50 కోట్ల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. అవసరమైతే మరిన్ని నిధులు తీసుకొచ్చి పనులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. టెండర్ ప్రక్రియను అతి త్వరలో పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. కాలేజీ భూముల కబ్జాలపై ఫిర్యాదులు వచ్చాయని, ప్రభుత్వ భూముల కబ్జాలను సహించేది లేదని హెచ్చరించారు. కాలేజీ స్థలాన్ని పూర్తిగా కాపాడతామని తెలిపారు. జమ్మికుంట, హుజూరాబాద్ మున్సిపాలిటీల్లో బీజేపీ అధికారంలో లేకపోయినా, కేంద్ర మంత్రిగా నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నానని బండి సంజయ్ అన్నారు. ఇటీవల జమ్మికుంట, హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రులకు రూ. 3 కోట్ల విలువైన వైద్య పరికరాలు అందించినట్లు తెలిపారు. అలాగే వివిధ కుల సంఘాలకు, దేవాలయాలు, పాఠశాలల అభివృద్ధికి నిధులు మంజూరు చేశామని చెప్పారు. జమ్మికుంట పేరుకే మున్సిపాలిటీగా ఉందని, అభివృద్ధి కనిపించడం లేదని విమర్శించారు. వర్షాలు పడితే మునిగిపోయే కాలనీలు ఎక్కువగా ఉన్నాయని, అభివృద్ధికి సరైన ప్రతిపాదనలు కూడా రావడం లేదని అన్నారు. అందుకే ప్రజలు ఆలోచించి మున్సిపాలిటీని బీజేపీకి అప్పగించాలని కోరారు. కరీంనగర్ తరహాలో జమ్మికుంట రైల్వే స్టేషన్‌ను అమృత్ పథకంలో చేర్చి, విమానాశ్రయం తరహాలో ఆధునీకరిస్తామని తెలిపారు. అలాగే జమ్మికుంట మున్సిపాలిటీని బీజేపీకి అప్పగిస్తే నాయిని చెరువును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసి, పడవ ప్రయాణం, ఉద్యానవన సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వానికి నయాపైసా లేదని, ఇప్పటివరకు మున్సిపాలిటీలకు సరైన నిధులు ఇవ్వలేదని ఆరోపించారు. కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చే శక్తి ఉన్నవారికే ప్రజలు అవకాశం ఇవ్వాలని పిలుపునిచ్చారు. కిరాయిదారుల కుటుంబాల్లో ఎవరైనా మరణిస్తే ఇళ్ల యజమానులు ఇళ్లలోకి అనుమతించకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్, ఆర్డీవోతో మాట్లాడి, స్థలం కేటాయిస్తే ఎంపీ నిధులతో ప్రత్యేక భవన సముదాయాన్ని నిర్మించి బాధిత కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, స్థానిక నాయకులు ఆకుల రాజేందర్, రఘు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో ఫిర్యాదుల పెట్టెలను పకడ్బందీగా నిర్వహించాలి

**మహిళా కానిస్టేబుల్ చేతిలోనే తాళాలు**

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**




కరీంనగర్, జనతా న్యూస్ : జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఫిర్యాదుల పెట్టెలను సమర్థవంతంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. స్నేహిత కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో ఫిర్యాదుల పెట్టెల నిర్వహణపై స్టేషన్ హౌస్ అధికారులు, మహిళా కానిస్టేబుళ్లు, శిశు అభివృద్ధి అధికారిణులు, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, బాలల హిత ఉపాధ్యాయులతో కలెక్టర్, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పాఠశాలల్లో విద్యార్థులకు ఏవైనా ఇబ్బందులు ఎదురైనప్పుడు ధైర్యంగా తెలియజేసేందుకు ఫిర్యాదుల పెట్టెల విధానాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా లైంగిక వేధింపుల నుంచి విద్యార్థులను రక్షించడంలో ఈ పెట్టెలు కీలకంగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం ప్రతి పాఠశాలలో ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేసి నిర్వహించాలని ఆదేశించారు. ఫిర్యాదుల పెట్టెలపై తప్పనిసరిగా సహాయ నంబర్లు ఉండాలని సూచించారు. పోలీస్, మహిళా శిశు సంక్షమ, విద్య శాఖలు సమన్వయంతో ఫిర్యాదుల పెట్టెల నిర్వహణ జరగాలని తెలిపారు. వీటికి సంబంధించిన తాళాలు మహిళా పోలీసుల వద్దనే ఉంటాయని స్పష్టం చేశారు. మహిళా పోలీసులు పాఠశాలలను సందర్శించి ఫిర్యాదులను సేకరించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. చైల్డ్ ఫ్రెండ్లీ ఉపాధ్యాయులు విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలిగి, తమ సమస్యలను భయపడకుండా చెప్పేలా ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. స్నేహిత క్లబ్ సభ్యులు ఉత్సాహంగా పనిచేసేలా చూడాలని తెలిపారు. పాఠశాల పరిధిలో ఏవైనా తప్పిదాలు, నేరాలు లేదా లైంగిక వేధింపులు జరిగితే ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. అలాంటి ఘటనలను నిర్లక్ష్యం చేస్తే సంబంధిత అధికారులు కూడా బాధ్యులై శిక్షర్హులవుతారని హెచ్చరించారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ, జిల్లాలోని ప్రతి పాఠశాల ఫిర్యాదుల పెట్టె నిర్వహణకు మహిళా పోలీసును కేటాయించినట్లు తెలిపారు. వారానికి ఒకసారి ఫిర్యాదులను సేకరించి నివేదికలు పంపుతారని చెప్పారు. అలాగే ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. సామాజిక మాధ్యమాల ద్వారా లైంగిక వేధింపులు, రక్షణ చట్టాలు, సహాయ నంబర్లపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు ధైర్యంగా ఫిర్యాదు చేయవచ్చని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. విద్యార్థులకు ఏవైనా సమస్యలు ఎదురైతే పరిష్కరించేందుకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, విద్యాశాఖ నాణ్యత సమన్వయకర్త అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

## జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో సంబరాలు



కరీంనగర్, జనతా న్యూస్ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులుగా మానకొండూరు శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ నియమితులైన సందర్భంగా జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కొర్వి అరుణ్ కుమార్ నేతృత్వంలో నగరంలోని తెలంగాణ చౌక్‌లో బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచుతూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ, కవ్వంపల్లి సత్యనారాయణ గారు టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులవడం సంతోషకరమన్నారు. గత ఆరు సంవత్సరాలుగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా పార్టీ పగ్గాలు చేపట్టి పార్టీ పటిష్టతకు విశేషంగా కృషి చేశారని ప్రశంసించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజా వ్యతిరేక విధానాలను ధైర్యంగా ప్రశ్నిస్తూ ప్రజలకు చేరువయ్యారని తెలిపారు. నేడు మానకొండూరు ఎమ్మెల్యేగా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన ఫలాలను ప్రజలకు చేరవేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులుగా నియమితులైన కవ్వంపల్లి సత్యనారాయణ గారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంబర కార్యక్రమంలో ఎండి తాజ్, బానోతు శ్రావణ్ నాయక్, అహమ్మద్ అలీ, వెన్నం రజిత రెడ్డి, మూల రవీందర్ రెడ్డి, కుర్ర పోచయ్య, నిహాల్, కర్ర రాజశేఖర్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, అబ్దుల్ రహమాన్, పంజాల కృపాసాగర్, సలీముద్దీన్, కుంభాల రాజకుమార్, దన్ను సింగ్, కొమ్రుద్దీన్, అమీర్, స్వప్న శ్రీ, గోపు మల్లారెడ్డి, యనమల మంజుల, దీకొండ శేఖర్, జీడి రమేష్, తోట ఆంజనేయులు, బత్తుల రాజ్ కుమార్, ఇమామ్, అబ్దుల్ బారి, పర్వత మల్లేశం, శ్రీరాముల రమేష్, హైమద్, మమత, గాలి అనిల్ కుమార్, దుబాసి కుమార్, తంగేళ్ల కిరణ్ కుమార్, బషీరుద్దీన్, సుదర్శన్, లక్ష్మణ్, కనకం విద్యాసాగర్, హస్తపురం తిరుపతి, బోయిని కృష్ణబాబు, తప్పట్ల అంజయ్య, మీసాల సాయిలు పాల్గొన్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com